# ఆశీర్వదించండి.. అండగా నిలుస్తా

- అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు
- నా గెలుపులో భాగస్వామ్యం కావాలి
- వ్యాపారులకు అండగా ఉంటా
- కూరగాయల మార్కెట్‌లో నన్నపునేని విస్తృత ప్రచారం



ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్న కూరగాయల మార్కెట్ వ్యాపారులు

కాశీబుగ్గ, నవంబర్ 2: మరోసారి ఆశీర్వదించండి.. అన్ని విధాలా అండగా ఉంటానని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వ్యాపారిని కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ చూడని విధంగా వరంగల్ తూర్పు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ వ్యాపార, వాణిజ్య వర్గాలకు అనుకూలంగా ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. తూర్పు ప్రజలతోపాటు జిల్లా ప్రజానీకం శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఆ ప్రగతి అందరి కళ్లెదుటే కనబడుతున్నదన్నారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తానన్నారు. అతి త్వరలోనే ఈ మార్కెట్ పనులు పూర్తి కానున్నట్లు చెప్పారు. వ్యాపారులు, ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ మార్కెట్ చరిత్రలో నిలిపోతుందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే నరేందర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్, కూరగాయల, పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ గెలుపు ఖాయం

కరీమాబాద్: రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్‌దే అధికారమని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఫోర్టురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఇతర పార్టీల నుంచి నాయకులు నన్నపునేని ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రతిపక్షాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఫిదా అవుతున్నారని చెప్పారు. ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణలో తమ పార్టీకి ఎదురులేదన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే అగ్రగామిగా నిలుపుతున్నారని కొనియాడారు. పార్టీని నమ్ముకుని వచ్చిన వారికి అండగా ఉంటామన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ గెలుపు కోసం నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

పోచమ్మమైదాన్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 21వ డివిజన్ మోమిన్‌పురకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మహ్మద్ తైసిన్, షరీఫ్, మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో సయ్యద్ రబ్బాని, మహ్మద్ జునైద, మహ్మద్ ఫిరోజ్, సోహెల్, అబీద్, ఆసీఫ్, సమీద్ వహద్, ఇక్బాల్, ఆజంబాబా, తైసిన్, గౌస్, హాజీతోపాటు మరో 50 మంది కార్యకర్తలు కార్పొరేటర్ ఎండీ పుర్ఖాన్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కార్పొరేటర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుబ్బ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు జూపాక అనిల్, ఆజం, మాజీ కార్పొరేటర్ యాకుబ్‌పాషా, ఎండీ ఆదిల్, ప్రదీప్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

కాశీబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు షేక్ ఫక్రుద్దీన్, ఉల్ఫత్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. గురువారం ఉదయం కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. పోచమ్మమైదాన్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ గని, ఎస్కే యాసిన్, కేఎల్ మహేంద్రానగర్‌కు చెందిన ఎస్కే ఉస్మాన్ సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధికి ఆకర్షితులై గులాబీ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

### ఎమ్మెల్యే నరేందర్‌కే సంపూర్ణ మద్దతు

గిర్మాజీపేట: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే నరేందర్‌కే తమ పూర్తి మద్దతు ఉంటుందని రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, తెలంగాణ మత్స్య సహకార సంఘం సమాఖ్య వైస్ చైర్మన్ దీటి శ్రీధర్ సమక్షంలో జిల్లా గంగపుత్ర సంఘం సభ్యులు స్పష్టం చేశారు. గురువారం రాత్రి శివనగర్‌లో ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో నన్నపునేనిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు భాగస్వాములం అవుతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గంగపుత్ర సంఘం నాయకులు డోలి రాజలింగం, బీఆర్ఎస్ నాయకులు ముష్కమల్ల సుధాకర్, పాక సురేందర్, రాజేంద్రకుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మైసయ్య, సారంగపాణి, రాజేశ్, కన్ని పాల్గొన్నారు.



పోచమ్మమైదాన్: కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ పుర్ఖాన్



తీర్మాన పత్రాన్ని ఎమ్మెల్యే నరేందర్‌కు అందజేస్తున్న కార్యవర్గం

## ఎమ్మెల్యేకు పరపతి సంఘం సంపూర్ణ మద్దతు

ఖిలావరంగల్, నవంబర్ 2: పడమరకోటకు చెందిన శ్రీభక్త మార్కండేయ పరపతి సంఘం తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు గురువారం సంఘం కార్యాలయంలో ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోద పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. పద్మశాలీలందరూ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో నన్నపునేనిని గెలిపిస్తామని ప్రమాణం చేశారు. సంఘం అభివృద్ధికి సహకరించి సుమారు రూ. 33 లక్షల నిధులు కేటాయించి ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నన్నపునేనిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామంటూ నినదించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ పాల్గొన్నారు.

## పార్థివదేహం నుంచి నేత్రాల సేకరణ

వరంగల్ చౌరస్తా, నవంబర్ 2: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర వాస్తవ్యుడు కందుకూరి రామ్మూర్తి(64) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యుల అంగీకారంతో తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో రామ్మూర్తి పార్థివదేహం నుంచి నేత్రాలు సేకరించారు. దాతలు 8790548706 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, నవంబర్ 2: ఆరుషీ హాస్పిటల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ భగీరథ్, డాక్టర్ జటాధర్, డాక్టర్ అజీద్ మహ్మద్ తెలిపారు. ఎంజీఎం దవాఖాన ఎదురుగా ఉన్న హాస్పిటల్‌లో బీపీ, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, దగ్గు, దమ్ము, ఆస్తమా, టీబీ, న్యూమోనియా, కామెర్లు, అల్సర్, ఛాతీనొప్పి, ఫిట్స్, పక్షవాతానికి ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## రూ. 14,600 విలువైన మద్యం పట్టివేత

గిర్మాజీపేట, నవంబర్ 2: కిరాణా షాపులపై దాడి చేసి రూ. 14,600 విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీపురానికి చెందిన లక్ష్మి, లింగాల అజయ్ మద్యాన్ని విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో దుకాణాలపై దాడి చేసి బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ కోసం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అందజేసినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ బాబూలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

### గంజాయి తరలిస్తున్న భార్యాభర్తలు అరెస్టు

ఖిలావరంగల్, నవంబర్ 2: గంజాయి తరలిస్తున్న భార్యాభర్తలను ఖిలా వరంగల్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బీ చంద్రమోహన్ కథనం ప్రకారం.. వరంగల్ రైల్వే స్టేషన్‌లో మహారాష్ట్ర బీడ్ జిల్లా బహిరవాడీకి చెందిన భార్యాభర్తలు సవిత, జానకిరామ్ అనుమానాస్పదంగా కనిపించారు. బ్యాగ్‌లను తనిఖీ చేయగా రూ. 3 లక్షల విలువైన 12 కిలోల ఎండు గంజాయిని గుర్తించామని తెలిపారు.

# నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- గ్రేటర్ కార్పొరేషన్ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ నామినేషన్లు
- 10 వరకు అభ్యర్థుల నుంచి స్వీకరణ
- ఉదయం 11 నుంచి 3 గంటల వరకు సమయం
- ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌వో రిజ్వాన్ బాషా, డీసీపీ బారి

వరంగల్, నవంబర్ 2: ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానున్నది. వరంగల్ తూర్పు నియోజకవర్గ నామినేషన్లు వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వీకరించనున్నారు. గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తూర్పు రిటర్నింగ్ అధికారి కావడంతో బల్దియాలోని ఆయన చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో 20 సీసీ కెమెరాలు అమర్చారు. బారికెడ్లను ఏర్పాటు చేశారు. నామినేషన్లు స్వీకరించే చాంబర్‌కు వెళ్లే దారిలో ప్రత్యేకంగా గేట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆర్‌వో కార్యాలయంగా ఉన్న కార్పొరేషన్ ఆఫీసులో ఎన్నికల కంట్రోల్ రూమ్, వివిధ అనుమతుల మంజూరు కోసం సువిధ సెల్, ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఎక్స్‌పెండిచర్ సెల్, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై నిరంతర నిఘా పెట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు, వీడియో బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ అంతా రిటర్నింగ్ అధికారి కార్యాలయం బల్దియా నుంచి పర్యవేక్షించనున్నారు.

### సమయం ముగిస్తే తిరస్కరణ

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించనున్నారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ వేసే అభ్యర్థితో కేవలం నలుగురిని మాత్రమే అనుమతించనున్నారు. సమయం ముగిసిన తర్వాత ఎలాంటి నామినేషన్లను అనుతించమని రిటర్నింగ్ అధికారి రిజ్వాన్ బాషా తెలిపారు. ఒక అభ్యర్థి రెండు చోట్ల మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంటుందని, నాలుగు సెట్ల నామినేషన్లు మాత్రమే వేయాలని సూచించారు. అభ్యర్థులకు నామినేషన్ల సమర్పణ సులువుగా ఉండేందుకు ఐదు కౌంటర్లతో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని ఆర్‌వో తెలిపారు. సిబ్బంది అవగాహన కోసం మాక్ నామినేషన్ల ప్రక్రియను నిర్వహించారు.

### ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌వో

నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ బారితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్లు వేసే చాంబర్ నుంచి 100 మీటర్ల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేయాలని వారు అధికారులకు సూచించారు. అలాగే, మీడియా పాయింట్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయడానికి వీలులేదన్నారు. ఎన్నికల ఖర్చుపై అభ్యర్థి డిక్లరేషన్ సమర్పించాలన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ బారి మాట్లాడుతూ నామినేషన్లు వేసే అభ్యర్థులు అరగంట ముందే కార్యాలయానికి రావాలన్నారు. చివరి నిమిషం వరకు వేచి చూసే ధోరణి సరికాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డీపీఆర్‌వో అయూబ్ అలీ, ఏసీపీ బోనాల కిషన్, తహసీల్దార్ ఇక్బాల్, వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ మధుసూదన్ పాల్గొన్నారు.



గ్రేటర్ కార్పొరేషన్ కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో షేక్‌రిజ్వాన్ బాషా, డీసీపీ బారి